

## బోయకొండపై
# పోటెత్తిన భక్త జనం

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 16 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం ఆదివారం భక్తులతో దద్ధరిల్లింది. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో బోయకొండ భక్తులతో పోటెత్తింది. వేదపండితులు, అర్చకులచే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.


# తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త






## భోగశ్రీనివాసుడికి
# ప్రత్యేక సహస్రకళశాభిషేకం



తిరుమల, జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని భోగశ్రీనివాసమూర్తిని పల్లవరాణి సామవై ప్రతిష్టించిన రోజు గుర్తుగా ఆదివారం ఉదయం ఆలయంలో భోగశ్రీనివాస మూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం నిర్వహించారు. ఆలయంలోపల గరుడాళ్వార్‌సన్నిధిలో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తిని, విశ్వక్సేనులనుకొలువుదీ అభిషేకాది క్రతువులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్‌దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పడికావలి ఏఇఒ నాయక్, అర్చకులు పాల్గొన్నారు.




# "తుడ" దక్కేదెవరికో!?

### టిడిపి నుండి పలువురు ఆశావహులు
### డైరెక్టర్ పదవులకు కూటమి నేతల కుస్తీ

ప్రభాతవార్త-తిరుపతి:
అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పలు నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించడంతో తిరుపతి జిల్లాలో ఎంతో ప్రాధాన్యత ఉన్న తుడ ఛైర్మన్ కుర్చీ ఎవరికి దక్కుతుందనే చర్చ మొదలైంది. ఈ కుర్చీకోసం తెలుగుదేశంపార్టీలోనే పలువురు ఆశావహులు పోటీపడుతుండటం మరింతగా హాట్‌టాఫిక్‌గా మారింది. తుడ ఛైర్మన్ పదవిని కూటమిపార్టీల్లోని టిడిపికే ఇవ్వాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నారు. తుడ ఛైర్మన్‌గా వున్న వ్యక్తి టిటిడి బోర్డులో సభ్యుడుగా కూడా ఎక్స్ఎఫిషియోగా కొనసాగుతాడు. దీంతో తుడలో పలు అభివృద్ధి పనులకు కూడా టిటిడినుండి నిధులు రాబట్టుకునే అవకాశం కలుగుతుంది. దీంతో ఈ కుర్చీకోసం ఓ యువనేతతోబాటు సుదీర్ఘకాలంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ అభ్యున్నతి, అధినేత ఆదేశాలు శిరసావహిస్తున్న తిరుపతికి చెందిన రాష్ట్రకమిటీ నేత తోబాటు ఓ ఎమ్మెల్యే కూడా పదవిని ఆశిస్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించండి....మీ సేవలను నామినేటెడ్ పదవులతో గుర్తింపునిస్తానంటూ అధినేత చంద్రబాబు హామీ ఇవ్వడాన్ని చర్చించుకుంటున్నారు. తిరుపతిలో పార్టీనేతలు లెక్కకు మించి ఉన్నా కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని పనిచేసిన ఆ నేతకే తుడ అప్పగిస్తే పార్టీలో అందరినీ కలుపుకెళతాడని నేతలు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఇప్పటికే సిఎం బాబు కూడా గుర్తించారని తెలుగుతమ్ముళ్ళలో చర్చ.

2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు తుడ పరిధి కేవలం తిరుపతి నగరం, పరిసరాల్లోని కొన్ని పంచాయతీలకే పరిమితమైంది. అప్పట్లో ఛైర్మన్‌గా నరసింహ యాదవ్‌కు అప్పగించారు. అయితే ఆయన నాయకత్వంలో తుడ అభివృద్ధి అంతంతమాత్రమేనని భావించారు. ఆ తరువాత 2019లో పార్టీ అధికారం కోల్పోవడంతో వైసిపి ప్రభుత్వంలో ఏకంగా అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి తుడ ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఆయన నేతృత్వంలో తుడ పరిధి విస్తరించడం, నగరి నియోజకవర్గంనుండి చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని అనేక గ్రామాలను తుడ క్రిందకు తీసుకువచ్చారు. ఆ గ్రామాల్లో అభివృద్ధికి తుడ నిదులు వినియోగించుకునే వెసలుబాటు లభించింది. 2024 తాజా ఎన్నికల్లో మళ్ళీ టిడిపి గెలవడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పాలనాపగ్గాలు చేపట్టడం జరిగింది. దీంతో నామినేటెడ్ పదవులు భర్తీని పార్టీలో సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న, ఎంతో కష్టపడి పనిచేస్తున్న టిడిపి నేతకు కట్టబెట్టేందుకు సిఎం కూడా సుముఖత చూపుతున్నారు. తుడ డైరెక్టర్ పదవులను కూటమి పార్టీల నేతలకు ఇస్తే సరిపోతుందని భావిస్తున్నారు. తుడతోబాటు గంగమ్మఆలయ పాలకమండలి, రవాణాశాఖ ,కులసంఘాల పదవులు, గ్రందాలయ సంస్థ ఛైర్మన్ వంటి కీలకమైన నామినేటెడ్ పదవులు కూడా రెండువారాల్లో భర్తీచేసేయనున్నారు. తుడ ఛైర్మన్ పదవికి పోటీ పడుతున్న ఆశావహుల్లో ఎవరికి కుర్చీ దక్కుతుందనేది వారంరోజులు వేచిచూడాల్సిందే.

## ఒంటరి ఏనుగు దాడిలో
# రైతు మృతి

### - పిఎంతాండాలో ఘటన..
### బాధితకుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం !!





మృతి చెందిన కన్ననాయక్, బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందిస్తున్న డిఎఫ్ఒ, నేతలు

రామకుప్పం, జూన్ 16 ప్రభాతవార్త
మండలంలోని పందా ్యలమడుగు పంచాయతీ పులిమడుగు తాండా గ్రామ సమీపంలో ఓ రైతును ఒంటరి ఏనుగు హతమార్చింది. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. శనివారం రాత్రి గ్రామానికి చెందిన కన్ననాయక్ (73) అనే రైతు పిఎంకె తాండాకు వెళ్లే దారిలో పశువుల షెడ్ల వద్ద ఉన్న పశువులను కట్టేసి ప్రధాన రోడ్డు మార్గంలో ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు పక్కనే గల సౌందర్ నాయక్‌కు చెందిన టమోటా తోటలో మేత మేస్తున్న ఒంటరి ఏనుగు ఒక్కసారిగా కన్ననాయక్‌పై దాడికి దిగి తొండంతో అతన్ని దూర ంగా విసిరేసింది. ఎంత సేపటికి కన్ననాయక్ ఇంటికి రాకపోగా కుటుంబీకులు, స్థానికులు గాలించగా సంఘటనా స్థలంలో కన్ననాయక్ అప్పటికే మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న డిఎఫ్ఒ చైతన్యకుమార్‌రెడ్డి, కుప్పం డిఎస్పీ శ్రీనాథ్, ఎఫ్ఆర్వో జయశంకర్‌లు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు డిఎఫ్ఒ చైతన్యకుమార్‌రెడ్డి, దేశం నేతలు ఆనందరెడ్డి, కృష్ణానాయక్, మునస్వామి, పత్ర నారాయణ, తదితరులు ప్రభుత్వం తరపున ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సిఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.

# పనినే దైవంగా భావిస్తా

### భక్తులకు సేవచేసే భాగ్యం తన అదృష్టం
### టిటిడి నూతన ఈఓ శ్యామలరావు



తిరుమల, జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి:
పనిని దైవంగా భావిస్తా...ప్రపంచం నలుమూలల నుండి హిందువులు పరమపవిత్రమైన తిరుమల ఆలయానికి విచ్చేసే వారికి సేవచేసే భాగ్యం కలగడం అదృష్టమని టిటిడి నూతన ఈఓ జె.శ్యామలరావు అన్నారు. ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. టిటిడిలో మంచి పరిపాలన అందించేలా చర్యలు తీసుకుంటా. ఉద్యోగులు జవాబుదారీ తనంతో పాటు విదులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటానన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. టిటిడి నూతన ఈఓగా నియమితులైన జె.శ్యామలరావు ఆదివారం మధ్యాహ్నం వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ నుండి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నికి చేరుకున్నారు. సెలవులో ఉన్న టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి నుండి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, జెఈఓగౌతమి నూతన ఈఓకు ఆలయ మర్యాదలతో అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వ ర్‌రెడ్డి, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఈఓ పెంచలకిశోర్ తదితరులు ఉన్నారు.



**క్యూలైన్ల తనిఖీ:**
సామాన్యభక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని, భక్తులు స్వామివారిని దర్శించుకుని సంతోషంగా వెళ్ళేలా చూస్తానని చెప్పిన మాట ప్రకారమే నూతన ఇఒ శ్యామలరావు తనదైన రీతిలో పనితీరు మొదలుపెట్టారు. ఈఓగా బాధ్యతలు చేపట్టిన నిమిషాల్లోనే కిలోమీటర్ల దూరం బారులుతీరిన సామాన్యభక్తుల క్యూలైన్లను తనిఖీ చేశారు.

# తోతాపురి టన్నుకు రూ.30 వేలు చెల్లింపు

### తక్కువ ధర చెల్లించే ఫ్యాక్టరీలు,
### ర్యాంపు యాజమానులపై కఠిన చర్యలు
### కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:
తోతాపురి మామిడి టన్నుకు 30 వేల రూపాయలు తగ్గకుండా రైతులకు చెల్లించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. రైతులకు తాము చెప్పిన మేరకు ధర చెల్లించని ఫ్యాక్టరీ యాజమానులు, ర్యాంపు యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సగిలి షన్మోహన్ హెచ్చరించారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ గత వారం రోజులుగా తోతాపురి రకం మామిడి ధర తగ్గుముఖం పట్టడంతో ధరల విషయమై ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 58 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి సాగు అవుతుందని, ఈ సీజన్‌లో మామిడి దిగుబడులు గణనీయంగా తగ్గడంతో రైతులు మామిడి పంటకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని భావించారన్నారు. సాధారణంగా ఒక ఎకరా విస్తీర్ణంలో మామిడి సాగు చేస్తే 4-6 టన్నుల మామిడి దిగుబడి రైతుకు లభించేదని ఈ ఏడాది పంట దిగుబడి లేకపోవడంతో ఎకరాకు 2 టన్నుల మామిడి దిగుబడి సైతం రాని పరిస్థితి నెలకొందన్నారు. ఈ సీజన్‌లో మామిడి దిగుబడి లేకపోవడంతో ధరలు ఆశాజనకంగా వుంటాయని రైతులు భావించారని అయితే గత వారం రోజులుగా తోతాపురి రకం మామిడి ధర తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రస్తుతం ర్యాంపు యాజమానులు, గుజ్జు పరిశ్రమల యాజమానులు రైతుల నుండి ఒక టన్ను తోతాపురి రకం మామిడి 23 వేల రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తోతాపురి రకం మామిడికి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్యాన, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో తోతాపురి రకం మామిడి దిగుబడి తక్కువగా వుండటం, ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి మామిడి గుజ్జు పరిశ్రమల యాజమానులు, మామిడి ర్యాంపు యాజమానులు టన్నుకు 30 వేల రూపాయలు తగ్గకుండా చెల్లించడానికి సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

# శివయ్య సన్నిధిలో మంచినీటికి కరువేనా?

### -భక్తుల తీవ్ర ఆగ్రహం



.శ్రీకాళహస్తి, జూన్ 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో రోజురోజుకు పెరుగుతున్న భక్తుల సంఖ్యతో పాటు వారికి సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు చేతులెత్తేశారు. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి 30వేలమందికి పైగా భక్తులు కదలిరాగా 6వేలమంది భక్తులు రాహుకేతు పూజలు నిర్వహించుకున్నారు. దీంతో ఆలయంలో ఎక్కడ చూసినా భక్తులు రద్దీ..రద్దీ.. ఓవైపు మండుటెండలో గుక్కెడు నీళ్ళు తాగుతామన్నా ఆలయంలో ఏర్పాటు చేసిన నీటి కుళాయిలు నుంచి మంచినీరు రాకపోవడంతో భక్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఇఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న కుళాయిల్లో కూడా నీళ్ళు రాకపోవడంతో కొందరు భక్తులు ఓ ఇంజనీరింగ్ అధికారికి ఫోన్‌చేసిన రెండు గంట వరకు రాలేదంటే పరిపాలన ఏవిధంగా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. కనీసం ఇంజనీరింగ్ అధికారులు స్పందించ లేదంటే ఆలయంలో పరిపాలన ఏవిధంగా ఉందో చెప్పవచ్చును. ఇకనైనా భక్తులకు సరైన సదుపాయాలు కల్పించేదిశగా ఇఓ, అధికారులు చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## త్యాగానికి ప్రతీక బక్రీద్
**- కలెక్టర్ సగిలి షన్మోహన్**



చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:
త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ నిర్వహించుకుంటారని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగ పురస్కరించుకుని జిల్లాలోని ముస్లిం సోదరులకు కలెక్టర్ సగిలి షన్మోహన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు నిర్వహించుకునే పండుగల్లో బక్రీద్ పండుగ ముఖ్యమైనదని, ప్రశాంత వాతావరణంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను సంతోషంగా మత సామరస్యంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కోరారు.

## మత సామరస్యానికి ప్రతీక బక్రీద్
**ఎస్పీ మణికంఠ చందోలు**



చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:
త్యాగానికి, తమ సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ఈ పండుగలను ముస్లిం సోదరులు సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆకాంక్షించారు. బక్రీద్ పండుగను పురస్కంచుకుని ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం జిల్లాలోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన కోరారు.

## ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు
**తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ, జెసి, ఎంపి**



తిరుపతి కార్పొరేషన్, జూన్ 16, ప్రభాతవార్త
జిల్లాలోని ముస్లీం సోదర, సోదరీమణులందరూ మత సామరస్యంగా బక్రీద్ పండుగను సంతోషంగా జరుపు కోవాలని కోరుతూ వారికి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లీం సోదర సోదరీమణులు అందరూ భక్తి శ్రద్ధలతో మత సామరస్యంగా బక్రీద్ పండుగను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలని కలెక్టర్, జెసి ధ్యాన చంద్ర, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

# రెవెన్యూ అధికారి సంతకాలు పోర్జరీ

**శ్రీకాళహస్తి పొలిమేరల్లో గతంలో ఏర్పాటు చేసిన రాజీవ్‌నగర్ కాలనీలో అనర్హుల పట్టాలంటూ గుర్తించిన వాటిని గత పాలకులు వారి అనుచరులు,సహచరులు వ్యాపారం సాగించారు. కోట్లు దండుకున్నారు. అయితే కొత్తగా వచ్చిన ఎంఎల్ఏ నిరుపేదల ఇళ్ళ ముందు దారి మూసేసి నిర్మించుకున్న కాలువ పోరంబోకు,రోడ్డు పోరంబోకుల్లో నిర్మించిన పక్కా కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు ఆయన ఆదేశాలతో టిడ్కో ఇళ్ళ ముందు కట్టడాలు సుమారు 51 అక్రమకట్టడాలును అధికారులు తొలగించారు.అక్రమ ఆక్రమణ దారులకు బ్రేక్ పడింది.**

### తలలు కొట్టుకుంటున్న అధికారులు
### టిడ్కో ఇండ్ల ముందు ఆక్రమణలు తొలగింపు
### అధికారుల గుండెల్లో గుబులు:అక్రమార్కులకు నష్టం





పనసకోన కాలువ వద్ద అక్రమకట్టడాన్ని కూల్చివేస్తున్న దృశ్యం, రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న అక్రమకట్టడాల నిర్మాణదారులు

తొట్టంబేడు, జూన్ 16 ప్రభాతవార్త
రాజీవ్‌నగర్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో చక్కటి ప్రణాళికలు రూపొందించారు. గుడి, బడి, కాలువ, గట్టుతేడా లేకుండా తొట్టంబేడు తహశీల్దార్ పరమేశ్వరస్వామి సంతకాలతో పట్టాలు జారీ అయ్యాయి. వాటి ఆధారంగా రోడ్డు పోరంబోకు, కాలువల్లో కూడా ఎంచక్కానిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం నిర్మించిన 5వేల టిడ్కో గృహాల ఇండ్లకు దారిలేకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతుంటే నిద్రావస్థలో ఉన్న రెవెన్యూ, ఆర్‌అండ్‌బి శాఖలు ఇప్పుడే మేల్కొన్నట్లు వ్యవహరించడం గమనించదగ్గ విషయం. ఆర్ అండ్ బి అధికారులు పిర్యాదుల మేరకు ఆక్రమణల తొలగింపుకు సిద్ధమైనట్లు తొట్టంబేడు తహశీల్దార్ శివరామసుబ్బయ్య చిలకపలుకులు పలికారు. సాయంత్రం అందిన సమాచారం మేరకు గుర్తించిన 51ఆక్రమణలను ఆదివారం సాయంత్రానికి తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. రాజీవ్‌నగర్‌లో అక్రమకట్టడాలు తొలగిస్తున్నారన్న సమాచారం అందుకున్న తెలుగుదేశంపార్టీ నాయకులు, మరియు కట్టడాలు నిర్మించిన వారు ఉదయం 6గంటల నుంచే అక్కడకు చేరుకున్నారు. అయితే ఎంఎల్ఏ వస్తారని సమాచారం అందడంతో అక్కడ నాయకులు వేచి చూశారు. దీంతో ఆయన రావడం లేదని తెలుసుకున్న తెలుగుదేశంపార్టీ నాయకులు అక్కడ నుంచి అందరు తిరుగుపయనమయ్యారు. దీంతో తొట్టంబేడు, శ్రీకాళహస్తి తహశీల్దార్‌లు శివరామసుబ్బయ్య, జనార్ధన్‌రాజు, ఆర్ఐలు రాజు, సర్వేయర్లు హరి, రాఘవ, లోకేష్‌లతో పాటు రెవెన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని తొలుత పనసకాలువ వద్ద ఉన్న అక్రమకట్టడాన్ని జెబితో కూల్చివేశారు. అనంతరం సమీపంలోని పివిఆర్ గ్రూప్స్ తోట పక్కనే కొందరు కబ్జాదారులు వేసి ఉన్న పునాదులను పెకలించారు. దీని పక్కనే ఓనాయకుడు ఎంచక్కా నిర్మించేసుకున్న షాపింగ్‌కాంప్లెక్స్‌ను తొలగించేందుకు వెళ్ళగా అడ్డుకుని రెవెన్యూవారిని కాస్త సమయం కావాలని కోరారు. రెండుమూడు రోజుల్లోనే వీటిని తొలగిస్తానని చెప్పడంతో పాటు పక్కనే ఉన్న ఓ మాజీ కౌన్సిలర్ అక్రమనిర్మాణాలకు అనుమతులు అడిగడంతో వాటి వరకు వదిలిపెట్టి మిగిలిన వాటిని అన్నింటినీ తొలగించారు. రాజీవ్‌నగర్ రోడ్డు 207,208,209, 210తో పాటు పనసకోన కాలువ 234, 238ల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు.

**అసలు తప్పెవరిది..**

అక్రమనిర్మాణాలు పట్టపగలు రాత్రివేళల్లో జరుగుతున్నా కనీసం రెవెన్యూ సిబ్బంది ఈకట్టడాల వైపు కన్నెత్తి కూడా చూడలేదంటే వారి జేబుల్లో ఎంత నిండాయో తెలుసుకోవచ్చును. ముందు ఇంటి నిర్మాణాలు జరుగుతున్న అడ్డుకోవడంలో అలసత్వం ప్రదర్శించిన రెవెన్యూ అధికారులు, మరోవైపు అక్రమనిర్మాణాలకు తహశీల్దార్ నుంచి విద్యుత్ మీటర్ కనెక్షన్‌కు రూ.30 నుంచి 50వేలు తీసుకుని తహశీల్దార్‌లు మీటర్లకు అనుమతిపత్రాలు మంజూరు చేశారు. ఇక సామాన్యుడి ఇంటి నిర్మాణాలకు మీటర్ల కనెక్షన్లకు అనుమతి ఇవ్వమంటే లేదని విద్యుత్ అధికారులు పేర్కొంటారని తెలిసిన విషయం విదితమే. ఇక విఆర్ఓలు, ఆర్ఐలు ఈవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం రెవెన్యూ అధికారులు తప్పే. పట్టాలపై తొట్టంబేడు తహశీల్దార్‌గా గతంలో పనిచేసి ఎసిబికి దొరికిపోయిన తహశీల్దార్ పరమేశ్వరస్వామి పోర్జరీ సంతకాలు, సీళ్ళు ఉండడం విశేషం. ఇక్కడ శాంతిభద్రతల పరిరక్షణలు పర్యవేక్షించేందుకు డిఎస్పీ అలా వచ్చి ఇలా వెళ్ళిపోయారు. ఇక టుటౌన్‌సిఐ రారాజు, తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్రలతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు. ఇక రెండోరోజైన ఆదివారం రెండు జెసిబిలతో అక్రమకట్టడాలను తొలగించారు. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర, బలగాలుతో పాటు రెవెన్యూసిబ్బందికట్టడాలనుకూల్చివేయడంతో టిడ్కోఇండ్లకు దారి దొరికినట్లయింది.

**కొన్నవారు కన్నీటి పర్యంతం..**

గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఈ ప్రాంతంలో ప్రచారానికి వచ్చిన సందర్భంగా అక్రమకట్టడాలు ఎవ్వరు కొనవద్దని తేల్చిచెప్పారు. అయినా కొన్న వారు కొందరు ఇక్కడకు వచ్చి రెవెన్యూ అధికారులకు మెరపెట్టుకున్నా కట్టిన కట్టడాలు కూల్చివేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా టిడ్కో ఇండ్లు పూర్తిచేసి నిరుపేదలకు ఇచ్చి ఉంటే మిగిలిన వారికి రెండుసెంట్లు స్థలం ఇవ్వమని పలువురి వాదన. ఇప్పటికే రూ.500లు, రూ.లక్ష డిడిలు కట్టిన వారికి ఇండ్లు కేటాయించకపోవగా డబ్బులు తిరిగి ఇవ్వమంటే పురపాలక సంఘ అధికారులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆక్రమ నిర్మాణాల కట్టడాల ఆక్రమణలు కూల్చివేతలతో నిరుపేదలు, ఆక్రమణ దారుల రియల్ వ్యాపారులు దందాలకు అడ్డకట్ట పడిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మంచిదే అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అంతేకాకుండా పట్టాల వ్యవహారంలో అధికారుల పాత్ర ఎంత ఉందో ఎంత మంది సస్పెషన్‌కు గురయ్యే అవకాశం ఉందో అని గుబులుపడుతున్నారు. కూల్చివేతలో తహశీల్దార్‌లతో పాటు సర్వేయర్ హరి, సచివాలయ సర్వేయర్లు రాఘవ, లోకేష్, విఆర్ఓ మునికుమారి, పలువురు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగాల పండుగ బక్రీద్

– ముస్లింలకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు శుభాకాంక్షలు



చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త: త్యాగాల పండుగ బక్రీద్ అని జిల్లాలోని ముస్లిం సోదరీ సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. బక్రీద్ పండుగ పురస్కరించుకుని జిల్లాలోని ముస్లింలకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల 10వ తేదీన ఈద్–ఉల్–అజా పండుగ జరుపుకోవడం అనవాయితీగా వస్తుందని, దీనిని ముస్లింలు సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే గురజాలను కలిసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేతలు

చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడును బుధవారం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు ఆయన నివాసంలో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శివయ్య ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుతో మాట్లాడు తూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పూర్తి సహకారం అందిస్తుందని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి సిఎం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు స్పందిస్తూ కొత్త ప్రభుత్వం ఏర్పాటులో ఉద్యోగుల సహకారం మరువలేనిదని, ఉద్యోగుల ఉన్నతి కోసం సిఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అలాగే ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, సమస్యలను పరిష్కరించడానికి తన వంతు సహకారం ఎల్లప్పుడు వుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపి ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి జిఎన్.హరిప్రసాద్, కోశాధికారి దేవకుమార్, ఉపాధ్యక్షులు నరేష్‌బాబు, గౌరీశంకర్‌లు, నాయకులు చలపతిరెడ్డి, హరిప్రసాద్, భాగ్యమేరీ, శైలజ, పయణి, శరత్, సౌజన్య, పద్మనాభం, కృష్ణమూర్తి, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బక్రీద్ పర్వదినం

కుప్పం, జూన్ 16 ప్రభాతవార్త

త్యాగనిరతికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను ముస్లిం సోదరులు సోమవారం జరుపుకుంటారు. ఈమేరకు ఉదయం నుంచే బక్రీదు పండగ ప్రార్థనలను మసీదులు, ఈద్గాలలో చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుప్పం పట్టణంలోని మస్‌జిద్ – ఎ – నబావిలో ఉదయం 6.30గంటలకు ప్రత్యేక ప్రార్థనలు మొదలవుతాయన్నారు. కుప్పం పట్టణంలోని లక్ష్మీపురం ఈద్గా వద్ద ఉదయం 8గంటలకు ఈద్ నమాజ్ ఆచరించడం జరుగుతుందని మత గురువులు తెలిపారు. అలాగే కొత్తపేట, మోడల్ కాలనీ ఈద్గాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మసీదులు, ఈద్గాల్లో బక్రీద్ ప్రార్థనలు చేపట్టనున్నారు. పండగ ఆదివారం సాయంత్రం కుప్పం పట్టణం కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ కన్పించింది.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 89మంది ఎంపిక

కుప్పంరూరల్, జూన్ 16 ప్రభాతవార్త



కుప్పం సాయిమాతా సేవా ట్రస్ట్, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే స్థానిక బాలుర హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 250మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 89మందిని ఉచిత క ంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు, వైద్య బృందం శివ, లావణ్య, నేత్ర, వీరభద్రప్ప పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సత్కరించిన ఎన్జీఓ నాయకులు

పలమనేరు, జూన్ 16, ప్రభాతవార్త:



పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని నియోజకవర్గం ఏపి ఎన్జీఓ నాయకులు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అమరనాథరెడ్డిను ఆదివారం ఆయన నివాసం వద్ద టిడిపి నాయకులు, అభిమానులతో పాటు పలు ఎన్జీఓ సంఘాల నాయకులు, ఉద్యోగులు పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉద్యోగులతో మాట్లాడుతూ ఉద్యోగులపై ఎటువంటి అనవసర ఒత్తిడులు లేకుండా మంచి వాతావరణంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ పరిపాలన కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఎన్జీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు, కార్యదర్శి జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షులులక్ష్మీపతియాదవ్, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి తదితరులు పాల్గొన్నారు.

## పౌర్ణమి అఖండ ధ్యానం

చిత్తూరురూరల్, జూన్ 16 ప్రభాతవార్త:

కాణిపాకం సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రం నందు ఈనెల 21తేది శుక్రవారం రాత్రి 9గంటల నుంచి 1గంటవరకు పౌర్ణమి అఖండధ్యానం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కన్వీనర్ రాధిక గోపాలక్రిష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే క్షేత్రం నందు విశాఖపట్టణం, సద్గురు స్పిరిచువల్ ఫౌండేషన్ ఫౌండర్ సాయి రత్న భీమనేని వంశీకిరణ్‌చే శని, ఆదివారం రెండురోజుల పాటు ఆత్మ జ్ఞాన సదస్సు నిర్వహిస్తామని, సదస్సులో పాల్గొనే వారందరికీ ఉచిత వసతితో పాటు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9448266653, 9490906653లను సంప్రదించాలని కోరారు.

## మంత్రి సత్యకుమార్‌ను కలసిన మదన్

–పుంగనూరు వస్తానని హామీ

పుంగనూరు, జూన్ 16 ప్రభాతవార్త :



రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యశాలల శాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను నియోజకవర్గ బిజెపి కన్వీనర్ గన్నా మదన్‌మోహన్‌బాబు ఆదివారం కలసి సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో ఆరోగ్యశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే సత్యకుమార్ ఆదివారం తిరుమలకు వెళ్ళడానికి రేణిగుంట విమానాశ్రయంకు వచ్చారు. విమానాశ్రయం వద్ద సత్యకుమార్‌ను కలసి అభినందనలు తెలిపి శాలువతో మదన్ సత్కరించారు. త్వరలో పుంగనూరులో జరగనున్న పార్టీ కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రిని మదన్ కోరడంతో ఆయన అంగీకరించారు. పుంగనూరు నియోజవర్గంలో భారతీయ జనతాపార్టీను ఐదేళ్ళుగా వృద్ధిలోనికి తీసుకురావడమే కాక, ఇటీవల ఎన్నికలలో కూటమి విజయానికి తీవ్రంగా కృషిచేసిన మదన్‌ను ఆయన అభినందించారు. కాగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ తన మొక్కు తీర్చుకోడానికి అలిపిరి వద్ద శ్రీపాదాల ఆలయం వద్దనుంచి మెట్లమార్గం గుండా తిరుమలకు బయలుదేరారు.

## ఎమ్మెల్యే థామస్‌ను కలిసిన పాలసముద్రం దేశం నాయకులు

పాలసముద్రం, జూన్ 16 ప్రభాతవార్త:



జిడినెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ థామస్‌ను ఆదివారం కార్వేటి నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మండల తెలుగుదేశం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా భీమినేని చిట్టిబాబునాయుడు, ఇతర తెలుగుదేశం నాయకులు జిడినెల్లూరు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించిన డాక్టర్ థామస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసునాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు రవినాయుడు, ఏలుమలై, బాబు, రంజిత్‌కుమార్, తంగరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆత్మీయ సమావేశాల్లో పాత నేస్తాలు

–ఒకే రోజున 3చోట్ల కలయిక



చౌడేపల్లి, జూన్ 16 ప్రభాతవార్త

ఆరు పదులు దాటిన వారందరూ ఓచోట... నాలుగు పదులు దాటిన వారందరూ మరో చోట...మూడు పదులు దాటిన వారందరూ ఒంకోచోట...ఈ విధంగా పాతనేస్తాలన్నీ కలసి ఆత్మీయ సమావేశాలు పెట్టుకొని హడావుడిగా కనిపించారు. దొరబావితోట పార్థసారధి తోటలో స్థానిక ఉన్నతపాఠశాల 1979–80, శ్రీలక్ష్మీ కళ్యాణ మండపంలో 1992–93, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2011–13పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. పార్థసారధి తోటలో 60యేళ్ళ యువకులు ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు చిన్నతనం జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. అదే విధంగా కళ్యాణ మండపంలోని పూర్వపు విద్యార్థులు భవిష్యత్తు కార్యచరణను రూపొందించారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే కలసి కట్టుగా సాయమందించుకోవాలనుకొన్నారు. మరి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు గురువులందరినీ ఒక చోట చేర్చి వారందరినీ ఘనంగా సన్మానించారు. చదువుకొన్న కళాశాల అభివృద్ధికి పాటుపడాలని తీర్మానించుకొన్నారు. వెంకటేష్, పార్థసారధి, ఈశ్వర్, సత్యనారాయణ, ఎవిఎస్ సుబ్రమణ్యం, ఆయా సంవత్సరాలకు చెందిన పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## అలరించిన రామకోటి

చౌడేపల్లి, జూన్ 16 ప్రభాతవార్త



మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ బిల్లేరులో నిర్వహించిన రామకోటి భక్తులను అలరించింది. గ్రామంలోని రామాలయం వద్ద రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో రామకోటి జరిగింది. చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో బిల్లేరులో పండుగ వాతవారణం నెలకొనింది. విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 16 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నెల్లూరు జిల్లా అక్కంపేటకు చెందిన ఇ.నరేంద్రరెడ్డి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి డీడీ రూపంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ వాసులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో మొక్కులు తీర్చుకున్న జనసైనికులు

కాణిపాకం, జూన్ 16 ప్రభాతవార్త:



ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుతో పలమనేరుకు చెందిన జనసేన నాయకులు కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. పలమనేరు టీడీపీ అభ్యర్థి ఎన్.అమర్నాధరెడ్డి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆరణి శ్రీనివాసులు గెలుపొందడంతో పాటు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పలమనేరుకు చెందిన జనసేన నాయకులు పూల చైతన్య, పూల చందుల ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఐరాల మండల జనసేన నాయకులు పూల ప్రభాకర్, కాణిపాకం రాజ్‌కుమార్, తిరువణంపల్లెకు చెందిన ఎం.మహేష్‌స్వేరో, హరి, వినోద్‌కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## దేవాదాయ శాఖ మంత్రితో ఎమ్మెల్యే రామకృష్ణ భేటీ



వెంకటగిరి టౌన్, జూన్ 16, ప్రభాతవార్త

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ భేటీ అయ్యారు. ఆనం మంత్రి పదవి చేపట్టిన సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి ఎమ్మెల్యే అభినందించారు. మంత్రి ఆనంతో పలు అంశాలపై ఎమ్మెల్యే కురుగొండ్ల చర్చించారు. సెప్టెంబర్ నెలలో జరిగే గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు విధులు ఇప్పించాలని మంత్రిని కోరినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే కొమ్మిలక్ష్మయ్య నాయుడు కూడా మంత్రి ఆనం కలిశారు.

## ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కలిసిన ఆర్డీవో

వెంకటగిరి టౌన్, జూన్ 16, ప్రభాతవార్త



నూతనంగా విజయం సాధించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ కలిశారు. ఎమ్మెల్యే రామకృష్ణకు పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. వెంకటగిరిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆర్డీఓతో ఎమ్మెల్యే చర్చించారు. ఇంకా పలు అంశాలపై ఆర్డీఓ ఎమ్మెల్యే చర్చించుకున్నారు.

## 19,20 తేదీల్లో బంగారుపేట పోలేరమ్మ జాతర

వెంకటగిరి టౌన్, జూన్ 16, ప్రభాతవార్త



పట్టణం బంగారుపేటలో వెలసి వున్న గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర ఈ నెల 19,20 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా నిర్వాహకులు జోరుగా ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం ఘటోత్సవంతో జాతర ప్రారంభమైంది. గుడి వద్ద పోలేరమ్మ జాతర కరపత్రాన్ని కౌన్సిలర్ సుబ్బారావుతో కలిసి నిర్వాహకులు ఆవిష్కరించారు. జాతర సందర్భంగా గుడికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. పోలేరమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19వ తేదీ అమ్మవారిని మట్టితో తయారు చేసి గుడిలో ఉంచి 20వ తేది వరకు భక్తుల దర్శనం అనంతరం నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు చెప్పారు. పోలేరమ్మ జాతర కమిటీ వారు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయశ్రీని సన్మానించిన టీడీపీ నేతలు

నాయుడుపేట, జూన్ 16 ప్రభాతవార్త



సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహనమణ్యం నివాసంలో ఆదివారం పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు పచ్చ మాధవనాయుడు, సూళ్లూరుపేట పట్టణ ప్రధాన కార్యదర్శి ఆడికుప్పం బాలచందర్, నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ, సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిలర్ వెంకటస్వామి, వెంకటయ్య, గౌడ సంఘం నాయకులు నాగరాజు, సీనియర్ టీడీపీ నాయకులు సురేష్ నాయుడు తదితరులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులకు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మెకానికల్, సివిల్ ట్రిపుల్‌ఈలపై దృష్టి సారించాలి

### డైరెక్టర్ డా.వి.విజయకుమార్ రెడ్డి

కోట, మే 16 ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల ప్రవేశాల జరుగుతున్నాయి. దీనికి తోడు ఇటీవల ఈఏపీసెట్ ఫలితాలు విడులయ్యాయి. కోట మండలం విద్యానగర్‌లోని ఆదివారం ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టిలో నూతనంగా చేరబోయే యువ ఇంజినీరింగ్ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్. వరదరెడ్డి విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ ర్యాంకుల ఆధారంగా వివిధ కళాశాలల్లో ఏ సీటు వస్తుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తితో ఎదురు చూస్తుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం ట్రెండ్‌ంతా సీఎస్‌ఈ, ఐటీ ఈసీఈ మీదే నడుస్తున్న కానీ కోర్ బ్రాంచ్‌లుగా ఉన్న మెకానికల్, సివిల్, ట్రిపుల్‌ఈలకు ఏమాత్రం ఆదరణ తగ్గలేదన్నారు.

ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులకు కూడా పలు సాఫ్ట్‌వేర్ సంస్థలు అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎన్జరీ, తయారీకి ప్రాముఖ్యం ఉన్న నేపద్యంలో ట్రిపుల్‌ఈ విద్యార్థులకు అవకశాలు మొండుగా ఉన్నాయన్నారు. ఆటోమోటివ్ రంగంలో విప్లవాత్మక మార్పులు వల్ల మెకానికల్ విద్యార్థులకు ఉజ్వల భవిత ఉంటుందన్నారు. వీరు సీ.జావా, పైధాన్ వంటి కోర్సులను అభ్యసించి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాల్సి ఉందన్నారు. దేశంలో నవ నిర్మాణ ప్రగతి నేపథ్యంలో సివిల్ ఇంజినీర్ల డిమాండు కూడా బాగ ఉందన్నారు. ప్రభుత్వరంగ, సంస్థలు, ప్రవేటు రంగ సంస్థల్లోనూ కొలువులు సాధించవచ్చునాని పేర్కొన్నారు. మెకానికల్ విభాగాధిపతిడా.సిహెచ్.విక్రమ్ కుమార్ మాట్లాడుతూ మెకానికల్ బ్రాంచి ఎప్పటికి ఎవర్ గ్రీన్ ఆర్దిక మాంధ్యంతో కూడా సంబంధం లేకుండా ఎప్పుడూ ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఆటో మొబైల్ నుంచి విమానం తయారీ వరకు ఈ నిపుణులు పాత్ర ఏంతో కీలకమన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.డి.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వీటితో పాటు నిర్మాణ రంగం కూడా ఊపందుకుందన్నారు ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతలు, డా.హరినాధ్ రెడ్డి, డా.రాజశేఖర్ రెడ్డి, డా.సి.రవీంద్రారెడ్డి, డా. ప్రభాకర్ రెడ్డి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక పాలసీని తక్షణమే అమలు చేయాలి

కోట, మే 16 ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీని తక్షణమే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోట మండల సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.వి. కృష్ణయ్య కోరారు. ఆదివారం ఆయన కోటలో విలేకర్లతో మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇసును వైకాపా ప్రభుత్వం వ్యాపార వస్తువుగా మార్చి ఇతర రాష్ట్రాలకు విక్రయించిందని ఆరోపించారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మంత్రి సత్యకుమార్ కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు

బాలాయపల్లి, జూన్ 16, ప్రభాతవార్త



వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొట్టమొదటిసారిగా తిరుమల శ్రీ వారి దర్శనం కోసం విచ్చేసిన సత్యకుమార్ యాదవ్‌ను వెంకటగిరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు గెరిటి చెంచయ్య యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చెంచయ్య యాదవ్ మాట్లాడుతూ సత్యకుమార్ యాదవ్‌కు మంత్రి పదవి వరించడం చాలా సంతోషంగా ఉందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ నుంచి రక్షణ కల్పించండి

– స్టోన్ క్రషర్స్ అధినేత జగదీష్‌నాయుడు



శాంతిపురం, జూన్ 16 ప్రభాతవార్త

పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ నుంచి తనకు రక్షణ కల్పించాలని కొలమాసనపల్లి వద్దగల శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్స్ అధినేత జగదీష్‌నా యుడు కోరారు. ఆదివారం శాంతిపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పట్టాలు మార్చుకున్నారన్నారని అలాగే తనకు చెందిన వాహనాలు, క్రషింగ్ యూనిట్ మెషినరీలకు అక్రమంగా తరలించుకున్నారని ఈ విషయంగా తనకు ప్రభుత్వం తగు న్యాయం చేయాలని పేర్కొన్నారు. తన క్రషర్ యూనిట్‌ను 2020లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆక్రమించి తమను భయభ్రాంతులకు గురిచేసి హింసలు పెట్టాడన్నారు. క్రషర్స్‌ను తానే ఓనర్‌నని ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ క్రషర్‌కు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండా వెంకటేగౌడ అక్రమంగా నిర్వహించి సుమారు వంద కోట్ల దాకా అక్రమంగా సంపాదించారన్నారు. ఎన్నికల ఫలితాలు రాగానే ఈనెల 4వతేది రాత్రి ఫ్యాక్టరీలో ఉన్న మిషనరీ, వాహనాలు తరలించాడన్నారు. తనకు సమాచారం రాగా తాను అక్కడకు చేరి నిలిపానన్నారు. 5వతేది నుంచి తాను తన ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నానన్నారు. వాహనాల తరలింపుపై పలమనేరు సిఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అక్రమాలకు తాను బాధ్యుడు కాదన్నారు. అధికారులను బెదిరించి వెంకటేగౌడ పట్టాలను మార్చారని పేర్కొన్నారు. 2022లో తన పేరిట లైసెన్సు రద్దు చేయాలని ఫోర్జరీ సంతకాలతో అధికారులకు సం ప్రదించారన్నారు. ఈ విషయం తనకు తెలిసి అధికారులకు పూర్తి వాస్తవాలు తెలియజేశానన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించేవారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తనకు రావాల్సిన 12కోట్ల రూపాయలు ఇప్పించాలని కోరారు.

## కొలువు నిలవాలని ఖాకీల యత్నాలు

కోట, మే 16 ప్రభాతవార్త

అవకాశం వస్తే రెచ్చిపోవడం, లేదంటే కాళ్ల బేరానికి రావడం పోలీస్ శాఖలో కొందరు అధికారులకు అలవాటుగా మారింది. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉమ్మడి జిల్లాలో కొందరు సీఐ,ఎస్.ఐలు తెదేపా నేతలను కాకాపట్టడం మొదలు పెట్టారు. గత ఐదేళ్లగా వైకాపా నేతలకు విధేయులుగా ,కండువా లేని కార్యకర్తల్లా పనిచేసిన కొందరు అధికారులు ఇప్పుడు తెదేపా నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అధికార దుర్వినియోగం పాల్పడ్డారని విమర్శలు సైతం లేకపోలేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించి పార్టీ వ్యక్తులుగా ముద్ర వేయించుకున్న కొందరు సిఐల పరిస్థితి దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. నాయకులు ఆదేశించారని అది ఎంత అడ్డగోలు వ్యవహారమైనా ,చట్ట విరుద్ధమైనా నిబంధనలకు పాతరేసి మరీ అధికారులు పాటించారు. ప్రత్యర్థులపై ఎడా పేడా కేసులు కట్టేశారు. కాలు కదిపినా, నోరు మెదిపినా స్టేషన్లలో నిర్బంచి వేధించారు. తిరుపతి జిల్లాలో గత అయిదేళ్ల పాలనలో కొందరు పోలీసు అధికారుల వ్యవహారం ఇదీ. తెదేపా నాయకుపై పలు కేసులు నమోదయ్యాయి. చిల్లకూరు ఎస్ఐ వైకాపాకు అనుకూలంగా వ్యహరించారని ఆరోపణలు రావడంతో ఆయనను బదిలీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఆరాచకాలకు ప్రజలు ఓటుతో బుద్ది చెప్పారు. కూటమికి పట్టం కట్టారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో కన్నూమిన్నూ కానకుండా వ్యహరించిన అధికారులు నూతన ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు యత్నిస్తున్నారు. తెలిసో తెలియకో తప్పులు చేశామని.. పెద్ద మనస్సుతో చేసుకోవాలంటూ తెదేపా నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీరిపట్ల నూతన ప్రజాప్రతినిధుల ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. తమకు అనుకూలంగా ఉండే పోలీస్ అధికారులనే వేయించుకోవాలని జిల్లాలోని నూతన శాసనసభ్యులు ఓ జాబితాను తయారు చేసినట్లు సమాచారం.

## పర్యాటక కేంద్రంగా పెనుమూరు అభివృద్ధి

**చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త:** పెనుమూరు మండలంలోని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. పెనుమూరు మండలంలో అనేక వనరులు, అవకాశాలు వున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదని, గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు జరిగిన అభివృద్ధి పనులు అలాగే ఆగిపోయాయన్నారు. స్థానికంగా ప్రత్యేకత సంచరించుకున్న పులిగుండు పర్యాటక కేంద్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు. వేయి అడుగుల ఏక శిలగా వున్న పులిగుండును ఎక్కడానికి మెట్లు ఏర్పాటు చేశారని, అలాగే టూరిస్ట్ హోటల్ ఏర్పాటు చేశారన్నారు. అయితే సరైన ప్రచారం, పులిగుండు చుట్టప్రక్కల వున్న 20 ఎకరాల స్థలంను కబ్జా చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారని, ఇక్కడ ట్రెక్కింగ్‌క్లబ్బు, పిల్లల పార్కు, రోప్‌వే ఏర్పాటు చేస్తే ప్రసిద్ధి పర్యాటక కేంద్రంగా పులిగుండు అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే కలువగుంట ఎన్టీఆర్ జలాశయం వద్ద పార్కు, బోటు క్లబ్ ఏర్పాటు చేస్తే చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వారాంతంలో విహరించి విశ్రాంతి పొందడానికి అనువుగా వుంటుందన్నారు. అలాగే ఎన్టీఆర్ జలాశయం నుండి గతంలో తలపెట్టిన 32 చెరువుల అనుసంధానం చేస్తే వేలాది ఎకరాలకు సాగు నీరు అందించడానికి అవకాశం వుంటుందన్నారు. అలాగే తిరుపతి నుండి పెనుమూరు మీదుగా చిత్తూరుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని, నేండ్రగుంట–పెనుమూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, జూనియర్ కళాశాల తూర్పు వైపు చిత్తూరు రోడ్డు నుండి అల్లాల చెరువు వద్ద వున్న కార్వేటినగరం రోడ్డు వరకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయన లేఖలో కోరారు.

# విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవరచుకోవాలి

## -ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

కేవీబీ పురం, జూన్ 16 ప్రభాతవార్త:
విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి క్రమశిక్షణను విలువలను విశ్వసనీయతను అవలంభించుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూలు(ఆదర్శ పాఠశాల)లో విద్యార్థులకు ప్రభుత్వం అందించే విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, విశ్వసనీయతను, విలువలను, ఎదుటివారు కష్టంలో ఉన్నప్పుడు సహాయపడే మనస్తత్వాన్ని నేర్పించాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయులే నవ సమాజాన్ని నిర్మించగల వ్యక్తులని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విద్య, వైద్య రంగంతో పాటు అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే విద్యా సామగ్రిని చక్కగా వినియోగించుకుని



ఉన్నత చదువులను చదివి దేశానికి రాష్ట్రానికి, గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించే విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మధ్యాహ్నం భోజనం విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా భోజనాలు అందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ రెడ్డిమోహన్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీపతి, రవికుమార్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రామాంజులనాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షులు కనపర్తి గోపీనాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, టీఎన్‌టీయూసీ అధ్యక్షులు జయరాంరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఏ.శివరావు, బీజేపీ అధ్యక్షులు శేఖర్‌యాదవ్, తిరుపతి పార్లమెంట్ టీఎన్‌టీయూసీ కార్య నిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ చౌదరి, మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, సత్యవేడు నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షులు సాధు, మండల మహిళా అధ్యక్షురాలు పావని, సర్పంచ్‌లు బాలాజీ, వెంకటేష్, సుదర్శన్‌నాయుడు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పానగల్ జాతర సంబరాలకు సన్నాహాలు

### 18,19 తేదీల్లో జాతర

శ్రీకాళహస్తి, జూన్ 16 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నగరాన్ని పూర్వం పాలించిన రాజులకాలంలో పట్టణాన్ని రెండుగా విభజించారు. ఇందులో పడమరవైపు ఉన్న ప్రాంతాన్ని పానగల్ అని నామకరణం చేసారు. ఇక్కడే వారు నివాసమున్నారు. ఈ ప్రాంతంలో జాతర సంబరాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. వేసవి కాలంలో నిర్వహించే జాతరకు చుట్టుపక్కల పది గ్రామాల నుంచి జనం రావటం ఆనవాయితీ. ఈ నెల 18,19 తేదీల్లో జరిగే జాతరకు ఈ నెల 11న చాటింపు జరిపారు. ఆదివారం పాత కమిటి నుంచి కొత్త కమిటి సభ్యులు గంగమ్మతల్లికి సంబంధించిన నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో కొన్ని ఉరువులు మాత్రమే అప్పగించారని పురాతన కాలం నాటి మరి కొన్ని అలంకరణ ఉరువులు అప్పగించాల్సి ఉందని యువ కమిటి వివరించింది. ఈ ఏడాది కొత్త యువ కమిటి గుణ, మునిశేఖర్, సత్రవాడ ప్రవీణ్, జయకృష్ణల సారధ్యంలో యువ కమిటి జాతరను నిర్వహించనుంది.

**జాతర సంబరాలు:**
పానగల్‌లో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. అమ్మవారికి విశేష అలంకారాలకు ప్రత్యేక నిపుణులను ఆహ్వానిస్తున్నారు. జాతర ఊరేగింపుకు రూ.1.5లక్షలు వెచ్చించి కొత్త ట్రాక్టర్‌ను తయారు చేయించారు. అప్పుడేసుమారు మూడు కిలో మీటర్ల వరకు విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసారు. దాంతో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. చాటింపుతో జాతర సంబరాలు చోటు చేసుకున్నాయి. శ్రీకాళహస్తిలో అంతర్భాగమైన పానగల్‌లో జాతరకు ఎంతో ప్రాధానత్య ఉంది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తొట్టంబేడు, జూన్ 16 ప్రభాతవార్త



శనివారం అర్ధరాత్రి మండలంలోని పొయ్య గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పొయ్య గ్రామం వద్ద ఆదివారం అర్ధరాత్రి నాయుడుపేట నుంచి వస్తున్న రెండు లారీలు శ్రీకాళహస్తి వైపు వస్తుండగా పొయ్య గ్రామం వద్ద ముందు వెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న లారీ ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ షాకిరాలీ(25) అక్కడికక్కడే మృతిచెందాడు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తిరుపతిలో ఘనంగా సాహిత్యానికి పట్టం

తిరుపతి హెల్త్, జూన్ 16, ప్రభాతవార్త



తిరుపతిలో ఘనంగా సాహిత్యానికి జాతీయ రాష్ట్ర ప్రజలు కళాకారులు పట్టం కట్టారు. ఎస్వీయూలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీ కళావేదిక 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళన విజయోత్సవం ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళా వేదిక డా. కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ శ్రీశ్రీ కళా వేదిక సంయుక్త నిర్వహణలో తిరుపతి కవితోత్సవం పేరుతో జాతీయ శతాధిక కవి సమ్మేళనంను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిల ప్రధాన కార్యదర్శి డా. ధనాసి ఉషారాణి నిర్వహణలో ఓ పండుగ వాతావరణంలో వైభవంగా నిర్వహించారు. వివిధ పద్య ప్రక్రియలకు రూపకర్తగా అనేక పద్యములను రాయిస్తూ ఉన్న నేపథ్యంలో పద్య చంద్రిక పుస్తక ఆవిష్కరణను ప్రముఖులు డా. కత్తిమండ ప్రతాప్ శ్రీశ్రీ వేదిక అంతర్జాతీయ చైర్మన్ కింగ్ ఇంద్ర ఆకుల గజేంద్ర ప్రసాద్, విసి కుసుమ కుమారి, భూమన కన్వీనర్ కొల్లిరమావతి ఈశ్వరీ భూషణం ,హరి సర్వోత్తమ నాయుడు, చిట్టేలలిత పార్థసారథి సంపత్ కుమార్ గుండాల రాకేష్, గద్దె లక్ష్మి చేతులు మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది. జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 150 మంది ప్రముఖ కవులు పాల్గొనడంతో పాటు ప్రత్యేకంగా కరాటి, కూచిపూడి నృత్య ప్రదర్శనతో కవుల్లో ఆకర్షణీయమైన కార్యక్రమంగా సాహిత్యంకు పట్టం కట్టే విధంగా వుందని కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఐదు రాష్ట్రాల నుండి కవులు పాల్గొని సామాజిక అంశాలతో సాహిత్యంకు వన్నెతెచ్చే విధంగా ఉండడం సంతోషమని ప్రొఫెసర్ మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌ని సాహితి సార్వ బిరుదుతోను గజేంద్ర ప్రసాద్‌ని సేవ సామ్రాట్ బిరుదుతో దనాసి ఉషారాణిని ఘనంగా సత్కరించారు.

## యోగా ప్రతి ఒక్కరూ నిత్యం చేయాలి

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




తిరుపతి కార్పొరేషన్, జూన్ 16, ప్రభాతవార్త
యోగా అంతర్జాతీయ దినోత్సవంపై అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. పతంజలి యోగా సమితి, భారత స్వాభిమాన్ సంయుక్తంగా ర్యాలీని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకాశం మున్సిపల్ పార్క్‌లో యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ ప్రజల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కల్పించడం ముదావహం అని ఆరణి శ్రీనివాసులు అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యం ప్రాక్టీస్ చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఫిట్‌నెస్ మెరుగు పడుతుందని ఆయన చెప్పారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు రోజు గంటసమయం వ్యాయామం కోసం వెచ్చించాలని కోరారు. ఆరోగ్యం బాగుంటేనే మెరుగైన ఆలోచనలు వస్తాయని దీనితో ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పతంజలి యోగా సమాజం ప్రతినిధి కైలాస్ సింగ్ రాజ్ పురోహిత్, జగన్నాథం, ఓటేరు కృష్ణ, యోగా గురువులు ప్రభాకర్, తంగరాజ్‌లు, రాధిక, తమ తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పి తాజా ప్రచార కార్యక్రమం

### ఇప్పి టాస్ ప్రారంభం



తిరుపతి హెల్త్, జూన్ 16, ప్రభాతవార్త
సన్‌ఫీస్ట్ ఇప్పి తమ ఇన్‌స్టాగ్రామ్‌లో తమ తాజా ప్రచారం ఇప్పి టాస్ గురించి వెల్లడించిన నూతన ప్రచార కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్ స్నాక్స్ నూడల్స్, పాస్తా, ఫుడ్ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కవితా చతుర్వేది మాట్లాడుతూ సన్ ఫీస్ట్ ఇప్పీ, సన్ ఫీస్ట్ నుంచి ప్రముఖ ఇన్‌స్టంట్ నూడిల్, పాస్తా బ్రాండ్, దేశంలో ఎక్కువ మంది ఇష్టపడే క్రికెటర్లు రాహుల్ ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్‌లతో తీర్చిదిద్దిన సరికొత్త ప్రచారంతో ఇది తిరిగి వచ్చిందన్నారు. ఈ వినోదభరితమైన ప్రచారంతో క్రికెట్ ఉత్సాహం తారాస్థాయి చేరుకుందన్నారు. జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ తమ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్‌లో ది టాస్ గురించి పంచుకున్నపోస్ట్‌ల వెనుక రహస్యం తెలుసుకోవాలనే ఆసక్తితో ఇప్పటి వరకు ఇంటర్నెట్‌లో ఆసక్తి నెలకొందన్నారు. ఆటగాళ్ల పోస్ట్‌ల వెనుక అర్థం తెలియక సతమతమైన అభిమానుల ఆసక్తిని మరింత పెంచుతూ, ఇతరులు కూడా దీనిపై వైరల్ చేశారన్నారు. ఈ నూతన ప్రచారంలో రాహుల్ ద్రావిడ్ ప్రారంభించారన్నారు. ఐటిసి సన్ ఫీస్ట్ ఇప్పి నూతన టివిసి అందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు.

## అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం, జూన్ 16 ప్రభాతవార్త:



గ్రామదేవత అంకాలమ్మ తల్లికి మిట్టకండ్రిగ గ్రామస్థులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఎంఎల్ఏగా పులివర్తి నాని విజయం సాధించాలని ప్రార్థిస్తూ గ్రామస్థులు మొక్కుకున్నారు. ఇందులో భాగంగా గ్రామదేవతకు మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో కూడిన పూజలు నిర్వహించి, నూతన వస్త్రాలు, వివిధ రకాల సుగంధభరిత పుష్పాలతో అమ్మవారికి విశేష అలంకరణ గావించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు తానికొండ కేశవులు నాయుడు, కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్రనాయుడు, లెక్కల మహేష్ నాయుడు, బాలవీరయ్య నాయుడు, నరశింహారెడ్డి, తులసిబాబు నాయుడు, జనార్ధన్ చౌదరి, మురళి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## భూదోపిడీ విలువ రూ.100కోట్లు

### బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, జూన్ 16 ప్రభాతవార్త



గడచిన ఐదు సంవత్సరాల కాలంలో శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్ మరియు పరిసర ప్రాంతాల్లో జరిగిన భూదోపిడీ విలువ వందకోట్లు రూపాయలని తెలుగుదేశంపార్టీకి చెందిన బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో వందలకోట్లు రూపాయల విలువలైన ప్రభుత్వ భూములను అధికార బలంతో ఆక్రమించి తమ ఇష్టానుసారం అమ్ముకుని సొమ్ముచేసుకున్న భూదోపిడీదారులపై పిడియాక్ట్ పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణానికి అతిసమీపంలోని అనేక ప్రాంతాల్లో గతంలో జరిగిన భూకబ్జాలకు పరోక్షంగా మద్దతు పలికిన ప్రతి ఒక్క అధికారిపై కేసులు నమోదు చేసేలా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి చర్యలుతీసుకోవాలని విన్నవించారు. తప్పుడు సర్వేనంబర్లతో పట్టాలు సృష్టించడం, అధికారులు సంతకాలు ఫోర్జరీ చేయడం ఒక ఎత్తయితే కాలువ పోరంబోకు, గుట్టపోరంబోకు, డి పట్టా తదితర భూములు రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన వ్యక్తులపై తాత్కాలికంగా 18ని అన్‌లైన్‌లో పొందుపరచడం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సదరు 18ని తొలగించేసి భూదోపిడీకి పరోక్ష సహకారం అందించిన అధికార యంత్రాంగంపైన న్యాయపరమైన చర్యలుతీసుకోవాలని ఉమేష్ డిమాండ్ చేశారు. రాజీవ్‌నగర్, కైలాసగిరి కాలనీ, తొట్టంబేడు మండలాల పరిధిలో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవుతుంటే చూసి చూడనట్లు వ్యవహరించిన అధికారుల పాత్రపై లోతైన విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నెమళ్ళూరుబుజ్జి, గణేష్, శివ, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

## నడివీధిలో పార్కింగ్ ఫీజు వసూలు: ట్రాఫిక్‌కు అంతరాయం

### టెండర్లు నిర్వహణకు అడ్డంకులేమిటి? -ఇదేమీ చోద్యం

శ్రీకాళహస్తి, జూన్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం మూడేళ్ళుగా కార్‌పార్కింగ్‌కు సంబంధించి టెండర్లు నిర్వహిం చటం లేదు. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముం దుకు రాలేదు. కారణం రాజకీయ వత్తిడి. దాంతో దేవస్థానమే వసూళ్ల చేస్తున్నారు. గత ఆర్నెల్లుగా వసూళ్ళ పరిస్థితి పరిశీలిస్తే రూ.కోటి దాటింది. కానీ ఏడాదికి టెండర్లు నిర్వహిస్తే రూ.90లక్షల కంటే ఎక్కువ రాదని మొండికేస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న భక్తులకు మాస్టర్ ప్లాన్ పుణ్యమా అని చక్కటి పార్కింగ్ సదుపాయం కల్పించింది. గతంలో పార్కింగ్‌కు స్థలం లేకుండా ఇబ్బందులు పడేవారు. శని, ఆది, సోమవారాల్లో వచ్చే వందలాది వాహనాలు పార్కింగ్‌కు అవకాశం లేకుండా వీధుల్లో పార్కింగ్ చేసే వారు. సువర్ణముఖి నదిలోనూ, దేవస్థానం అతిథి గృహాల వద్ద పార్కింగ్‌చేసే వారు. ఈ విధానం ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గి చివరకు కోర్టు వరకు సమస్య వెళ్ళింది. ప్రస్తుతం పార్కింగ్‌కు మాస్టర్‌ప్లాన్‌కు సేకరించిన భూములు సుమారు 4 ఎకరాల్లో ఎక్కడ బడితే అక్కడ పార్కింగ్‌చేసు కుంటున్నారు. అయితే వచ్చిన వాహనాల దారుల వద్ద వసూళ్ళు ఇబ్బందిగా మారింది. కొందరు యువకులు పార్కింగ్ ఫీజుల్ని రాజగోపురం పక్కన నిలబడి వసూలు చేస్తున్నారు. ఈ మార్గంలో రైల్వేస్టేషన్‌కు వెళ్ళేవారు. మరో వైపు గ్రామాలకు వెళ్ళే వాహనాలు, దేవాలయానికి వెళ్ల వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ రోడ్డుకడ్డంగా నిలబడి పార్కింగ్ ఫీజులు వసూలు చేయటం అంటే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గుతుంది. పార్కింగ్ వసూళ్ళకు సంబంధించి రాజగోపురం, పొన్నాలమ్మ గుడి వద్ద రోడ్డుకడ్డంగా విచ్చల విడిగా వ్యవహరిస్తుంటే రాక పోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో వెళ్ళు రాజకీయ నాయకుల వాహనాల్ని కూడా నిలిపి వేస్తూ ఇబ్బంది కల్గిస్తున్నారు. పొన్నాలమ్మగుడి వద్ద, రాముల వారి మందిరం వద్దనే వసూలు బృందాలు తిష్టవేయటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అయితే వసూళ్ళు చేస్తున్న సిబ్బంది ఒకూడా ఇబ్బంది పడుతున్నారు. వారికి నిలువ నీడ కూడా లేదు. మండుటెండల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ బడితే అక్కడ వసూళ్ళు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి 'పార్కింగ్ వసూళ్ళకు హద్దులు ఏర్పాటు చేయాలని' కోరుతున్నారు.

**దిష్టిబొమ్మల్లా సిగ్నల్‌లైట్లు:-**
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం రోజు రోజుకు అభివృద్ధి పథంలో నడుస్తుంది. పెరుగుతున్న జనాభా, వాహనాల దృష్ట్యా ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే మహోన్నత లక్ష్యంతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా సూపర్ బజార్ కూడలి, పెండ్లిమండపం, ఆర్‌టిసి బస్టాండు ప్రాంతాల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇవి పనిచేయడం లేదు. ఇక ట్రాఫిక్ పోలీసులు ఎప్పుడు పడితే అప్పుడు వన్‌వే అంటూ పేర్కొంటు ప్రజలకు, వాహనచోదకులను ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ దేవాలయానికి వచ్చే భక్తుల్ని ఆర్‌టిసి బస్సులు నిలపాల్సి ఉంటుంది. అలా నిలిపినపుడు వెనుక వచ్చిన వాహనాల మాటేమిటి? సూపర్‌మార్కెట్ వద్ద ఆర్‌టిసి బస్సులు శివభక్తుల్ని ఎక్కించుకుంటారు. సిగ్నల్స్ వ్యవస్థ అమలు చేయాలంటే సవాలక్ష సమస్యలు చోటు చేసుకుంటాయి.

**షేర్ ఆటోల్ని అదుపు చేయనిదే , , ,**
శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నాలుగుమాడావీధుల్లో 'షేర్ ఆటోల్ని' అదుపు చేయనిదే పోలీసులు ఎన్ని సంస్కరణలు చేపట్టినా ప్రయోజనం లేదు. ఈ వాస్తవాలు పోలీసులక తెలియనిది కాదు. కానీ ఎందుకో ఏ ఒప్పందంతోనూ వాటిని అదుపు చేయలేక పోతున్నారు. వీటిని గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం నడుస్తుంటే వేదాం మార్గంలోని షేర్ ఆటోల్ని సన్నిధివీధిలోని జలవినాయక ఆలయం వద్ద, నాయుడుపేట వైపు వెళ్ళు ఆటోల్ని పాత నెల్లూరుబస్టాండు వద్ద, తడ, కెవిబిపురం వైపు వెళ్ళు షేర్ ఆటోల్ని వీఎంసి సర్కిల్, వెంకటగిరి, ఏర్పేడు వైపు వెళ్ళు వాహనాల్ని పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద వద్ద పార్కింగ్ చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ ఈ దిశగా పోలీసులు స్పందించటం లేదు. ఈ సంస్కరణలు చేపడితే సరిపోతుంది. ఇక పాతబస్టాండు వద్ద షేర్ ఆటోలు తమ ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ఈమార్గంలోను ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఇకనైనా సంబందిత అధికారులు పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించాల్సి ఉంది.

## మంత్రి సత్యకుమార్‌కు శివయ్య ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జూన్ 16 ప్రభాతవార్త



రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా తిరుమలకు విచ్చేయు సందర్భంగా తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరుని తీర్థప్రసాదాలు అందించారు. రాష్ట్రంలో రాక్షస పాలన పోయి ప్రజలందరు ప్రశాంతమైన వాతావరణంలో ఉండేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వివరించారు. ప్రజలందరు మెచ్చిన మ్యానిఫెస్టో దేశ ప్రధాని నరేంద్రమోడీ ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రి కావడం ఎంతో సంతోషమన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎమ్మెల్యే ఆదిమూలం సమక్షంలో

### అరణ్యంకండ్రిగ సర్పంచ్ టిడిపిలో చేరిక

నారాయణవనం, జూన్ 16 ప్రభాతవార్త :



నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ వైకాపా మద్దతుతో గెలుపొందిన రత్నమ్మ ఆదివారం ఉదయం సత్యవేడు టిడిపి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు టిడిపి కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్ట మొదటి సారిగా ఆమె చేరింది. అనంతరం సర్పంచ్ రత్నమ్మ కూడా ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్యే తనయుడిని దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. గతంలో ఈ పదవిరావడానికి కారణం మీరేని మీకు రుణపడి వుంటానన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పని చేసినట్టు గుర్తు చేసింది. ఆమెతో పాటు మాజీ కైలాసకోన ఛైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, అరణ్యకం డ్రిగ పంచాయతీ టిడిపి అధ్యక్షులు బొమ్మినేని శ్రీనివాసులు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలి

తిరుపతి విద్య, జూన్ 16, ప్రభాతవార్త



ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థుల తల్లులకు మాత్రమే అమ్మ ఒడి కార్యక్రమం అమలయ్యేలా చూడాలని నూతనంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి గట్ల సాంబిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. స్థానిక న్యూ ఇందిరానగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యాలయంలో సాంబిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని అలాంటి పాఠశాలలు పదికాలాల పాటు మనుగడ సాగించి బలోపేతం కావాలంటే ప్రభుత్వ పాఠశాలలో చదివేటటువంటి విద్యార్థులకు మాత్రమే అమ్మ ఒడి వర్తించేలా అమ్మ ఒడి పథకంలో నిబంధనలు సవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టడం వలన ప్రాథమిక స్థాయి ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులు అందరూ ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయడానికి చాలా ఇబ్బందులు పడ్డారని గతంలో అనేక మంది మేధావులు అనేక కమిషన్‌లు ఇచ్చినటువంటి రిపోర్టుల ప్రకారం విద్యార్థి మాతృభాష ద్వారానే సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని మాతృభాషలో ప్రావీణ్యం సంపాదిస్తే ఇతర భాషలలో కూడా ప్రావీణ్యం సులభంగా సంపాదించగలుగుతారని సూచించిన నేపథ్యంలో పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు మాధ్యమం, 6 నుంచి 10 తరగతుల వరకు ఆంగ్ల తెలుగు మాధ్యమాలలో బోధన జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు దేవరాజులు, తిరుపతి జిల్లా ఆపస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం

రేణిగుంట, జూన్ 16 ప్రభాతవార్త:



బక్రీద్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని రేణిగుంట పట్టణానికి ఆహ్వానించినట్లు ముస్లిం మైనారిటీ నేతలు తెలిపారు. ఆదివారం రేణిగుంట ముస్లిం మైనారిటీ టీడీపీ నాయకులు మునీర్ జీకే ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి శాలువలు కప్పి సత్కరించారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మను ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ సందర్భంగా మైనారిటీ నేతలు ముస్లింలకు అతి పెద్ద రెండవ పండుగ అయిన బక్రీద్‌కు రావలసిందిగా ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఎమ్మెల్యే వారి ఆహ్వానానికి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రేణిగుంట ముస్లిం మైనారిటీ సీనియర్ నేతలు రేణిగుంట పట్టణ ముస్లిం మైనారిటీ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మునీర్ జీకే, నవాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు అఫ్రోజ్, హాజీ రహీం, సమీ, జిలాని , కరింముల్లా, ఇమ్రోజ్, సలీం, మహబూబ్ బాషా, టీడీపీ సీనియర్ నేతలు డి.పుష్పనాథం, ఈనాడు నాగేశ్వరరావు, అంబి, గౌతమ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## పాలస్తీనాలో కాల్పులు విరమించాలి : సీనియర్ జర్నలిస్టు

రేణిగుంట, జూన్ 16 ప్రభాతవార్త:
రేణిగుంటప్లై ఓవర్ వద్ద రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పాలస్తీనా సంఘీభావ సదస్సు జరిగింది. సదస్సులో సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి కలత చెందుతున్నదన్నారు. ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనా సామాన్య పౌరులపై చేస్తున్న అమానుష దాడిని ఖండించారు. మారణహోమాన్ని చూసి 20 లక్షల మంది పాలస్తీనా ప్రజలు సొంత గడ్డపై శరణార్థులుగా మారిపోవడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరా ఆపి సైనిక సంబంధాలు రద్దు చేసుకోవాలన్నారు. అవాజ్ నాయకుడు దిలీప్ బాషా అధ్యక్షతన సదస్సు జరిగింది. ఇజ్రాయిల్ దాడిలో మరణించిన పాలస్తీనా వాసులకు సంతాపం తెలియజేశారు. అనంతరం పాలస్తీనాను స్వతంత్ర రాజ్యాంగ ప్రకటించాలని, మనదేశం ఇజ్రాయిల్‌తో సైనిక సంబంధాలు రద్దు కోవాలని ఏకగ్రీవ తీర్మానాలను ఆమోదించింది. సదస్సులో జన విజ్ఞాన వేదిక నాయకులు షరీఫ్, రఫీ, సత్యశ్రీ, అమీర్ బాషా, హరినాథ్, రమణ తదితరులు మాట్లాడారు.



## నగరి ఎమ్మెల్యేకి తిరుమల వేదపండితులు ప్రసాదం అందజేత

నగరి, జూన్ 16 ప్రభాతవార్త:
తిరుమల వేదపండితులు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్ర కాష్‌కి ఆదివారం లడ్డు ఆశీర్వ చనం అందించి, ప్రసాదం అందజేశారు. వేద పండితులతో తిరుమలలో ఉన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన కోరారు.



## ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు గజమాలతో సన్మానం

విజయపురం, జూన్ 16 ప్రభాతవార్త:



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను ఆదివారం మండలంలోని మాధవరం గ్రామస్తులు గజమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే గెలుపొంది మొదట గ్రామానికి రావడంతో కార్యకర్తలు ఆనందోత్సాహంతో ఆహ్వానం పలికారు. అనంతరం మాధవరం టీడీపీ నాయకులు సెల్వం, ఇల్లత్తూరులో టీడీపీ నాయకులు ప్రకాష్ నిర్వహించిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు జయరాజ్, సెల్వం,ముని భాస్కర్‌రాజు, గోవిందరాజులు, వేలు, ఆర్ముగం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి సేవ చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందాను/ ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్



తిరుపతి హెల్త్, జూన్ 16 (ప్రభాతవార్త : నన్ను అక్కున చేర్చుకుని, నా ఎదుగుదలకు తోడ్పాటునిచ్చిన జర్నలిస్టు సమాజానికి తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్ అన్నారు. జర్నలిస్టుగా సమాజానికి సేవ చేస్తూ ఎమ్మెల్యేగా గెలుపొందిన మురళి మోహన్ ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన్ను ఘనంగా సత్కరించారు. ముందుగా సాలిగ్రామ వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చక బృందం వేద ఆశీర్వచనం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ నా విజయం పూతలపట్టు నియోజకవర్గ ప్రజలు, జర్నలిస్టు సమాజానికి దగ్గిన గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచి తాను ఎమ్మెల్యే కావాలని కలలు కన్నానని చెప్పారు.ఆ కలను సాకారం చేసుకొనేందుకు అను నిత్యం ప్రయత్నం చేసి, ఈ నాటికి నా కలను నెరవేర్చుకున్నానని చెప్పారు. అసెంబ్లీలో ప్రజావాణితో పాటు జర్నలిస్టుల సమస్యలను ప్రస్తావించే అవకాశం దక్కిందన్నారు. జర్నలిస్టు వృత్తి నుంచి వచ్చిన నాకు ప్రజా సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉందన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌కు సొంత స్థలం సమకూర్చే బాధ్యతను, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర మాట్లాడుతూ 40 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి ప్రెస్ క్లబ్ నుంచి మొట్టమొదటిగా మురళి మోహన్ శాసనసభ్యులుగా చట్టసభలకు వెళ్లే అవకాశం లభించడం అభినందనీయమన్నారు. ప్రెస్‌క్లబ్ ట్రెజరర్‌శ్రీకాంత్ మాట్లాడుతూ మన మధ్యలో ఉన్న వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుపొందడం సంతోషించదగ్గ విషయం అన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు ఉమామహేశ్వరరావు, దేవరాజన్, రవికుమార్, రామచంద్రారెడ్డి, నగేష్, సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిన మురళికి శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్, జాయింట్ సెక్రటరీ దినేష్, ఈసీ సభ్యులు సునీల్ మహేష్, పరంధామ రెడ్డి, వసుంధరలతో పాటు సీనియర్ జర్నలిస్టులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**– మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**



రేణిగుంట, జూన్ 16 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి శ్రీకట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. వివరాలు ఇలా... తెలంగాణ జడ్జర్లకు చెందిన గిరి(40), తిరుపతికి చెందిన మహేష్, హైదరాబాద్‌కు చెందిన అరుణ్ తిరుపతిలోని రోడ్డి భవన్ హోటల్‌లో ప్లంబింగ్ వర్క్ చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఓ ద్విచక్ర వాహనంపై రేణిగుంట మండలం మామండూరు వాటర్ఫాల్ వద్దకు వెళ్లారు. విహార యాత్ర ముగించుకుని అదే ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా కరకంబాడి శ్రీకట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 ద్వారా చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి గిరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. రేణిగుంట అర్బన్ సీఐ మల్లికార్జున్ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దేవస్థానానికి రూ.36లక్షల విలువైన ప్రచార రథం వితరణ



శ్రీకాళహస్తి, జూన్ 16 ప్రభాతవార్త: దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి మహత్యాన్ని రాష్ట్ర నలుమూలల్లో ప్రచారం నిర్వహించేందుకు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అధికారులకు సుమారు రూ.36లక్షలు విలువై చేసే (భారత్‌బెంజ్) ప్రచార వాహనాన్ని వరుణ్ ట్రాక్స్ షోరూం నందు కొనుగోలు చేయగా వరుణ్ ట్రాక్స్ ఏజెన్సీ సౌజన్యంతో శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంకు సుమారు రూ.10 లక్షలు తగ్గింపుతో రూ.26లక్షల వాహనాన్ని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అధికారులకు అందించారు. నూతన ప్రచార వాహనానికి ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి తీసుకువచ్చి ఆలయ పారోహితులతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భారత్ బెంజ్ వరుణ్ ట్రాక్స్ షోరూం అధినేత ఆలయ ఇఒ ఎస్‌వి.నాగేశ్వరరావుకి వాహన తాళాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఏకాంబరం, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఏఈవో సతీష్‌మాలిక్, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## జనసంద్రంగా కాణిపాకం ఆలయం

**-వేసవి సెలవులు ముగిసినా తగ్గని భక్తుల రద్దీ**



కాణిపాకం, జూన్ 16 ప్రభాతవార్త: పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసినా భక్తులు రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుండి అనూహ్యంగా తరలివచ్చిన భక్తులతో కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి ఆలయం ఆదివారం జనసంద్రంగా మారింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. అలాగే గత నాలుగు రోజుల క్రితం వరకు పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గత కొద్ది రోజులుగా ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. అయితే ప్రస్తుత వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పున: ప్రారంభమయ్యాయి. అయినప్పటికి ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది.

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**- కలెక్టర్ సగిలి షన్మోహన్**

చిత్తూరు, జూన్ 16 ప్రభాతవార్త: చిత్తూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

## మిన్నంటిన అభిమానం

**- మోకాళ్ళతో తిరుపతి నుండి తిరుమల వరకు వెళ్ళి మొక్కు తీర్చుకున్న తెలుగుదేశం కార్యకర్త**



పాలసముద్రం, జూన్ 16 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం, జిడ నెల్లూరు నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ థామస్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆ తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు అభిమానం మిన్నంటింది. తమ అభిమాన నాయకులు సిఎంగా, ఎమ్మెల్యేలుగా బాధ్యతలు స్వీకరిం చడంతో ఎన్నికల ముందు మొక్కుకున్న మొక్కులను తీర్చాలని పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీకి చెందిన తెలుగుదేశం కార్యకర్త యశ్వంత్ యాదవ్ తిరుపతి నుండి తిరుమల వరకు మోకాళ్ళతో మెట్లు ఎక్కి స్వామి వారిని దర్శించుకుని మొక్కుబడిని తీర్చుకున్నాడు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తే తిరుమలకు తిరుపతి నుండి మెట్ల మార్గంలో మోకాళ్ళ మీద వచ్చి స్వామి వారిని దర్శించుకుంటానని యశ్వంత్ యాదవ్ మొక్కుకున్నాడు. ఈ మేరకు తిరుపతి నుండి తిరుమల వరకు కాలి నడక మార్గంలో మెట్లను మోకాళ్ళపై వెళ్ళి స్వామి వారిని దర్శించుకొని రాష్ట్రంలో ఉత్తమ పరిపాలన సాగించడానికి సిఎం చంద్రబాబునాయుడు ఆరోగ్యంతో వుండాలని ప్రార్థించుకొని యశ్వంత్‌యాదవ్ ఇంటి బాట పట్టాడు.

## సుధీర్‌రెడ్డిని సత్కరించిన చంద్రప్ప



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 16 ప్రభాతవార్త: ఎన్డీయే కూటమి శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ ఎంఎల్‌ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిని ఆదివారం ఆయన స్వగృహంలో బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప మర్యాద పూర్వకంగా కలసి కలియుగ వెంకటేశ్వరస్వామి శేషవస్త్రం, శ్రీవారి పాదుకుల ప్రతిమను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు కర్నాటక హైకోర్టు జడ్జిలు



కాణిపాకం, జూన్ 16 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామి వారిని పలువురు కర్నాటక హైకోర్టు జడ్జిలు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించ ఎకున్నారు. ఈమేరకు కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ సి.సుమలత, జస్టిస్ ఎస్.హరీష్‌కుమార్, జస్టిస్ అశోక్ ఎస్‌కినాగిలు కుటుంబసమేతంగా వేర్వేరుగా కాణిపాకం స్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెండెట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభిమానులకు పులివర్తి వారి అన్నప్రసాదం

**ఆప్యాయతతో వడ్డించిన సుధారెడ్డి-నాని గెలుపుతో ఊట్లవంక గ్రామస్థుల యాత్ర**



చంద్రగిరి, జూన్ 16 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు పులివర్తి వారి అన్నప్రసాదాలను పులివర్తి సుధారెడ్డి స్వయంగా వడ్డించారు. పాకాల మండలం, దామలచెరువు పంచాయతీ, ఊట్లవంక గ్రామస్థులు టిడిపి ఎంఎల్‌ఏ పులివర్తి నాని భారీ మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ తిరుమల శ్రీవారికి మ్రొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఊట్లవంక గ్రామస్థులు వంద మందికి పైగా కాలినడకన తిరుమలకు బయలుదేరారు. తమ కుటుంబం పట్ల ఇంతటి అభిమానంతో కాలినడకన వస్తున్న వారికి శ్రీనివాస మంగాపురం వద్ద పులివర్తి సుధారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఇక్కడ వారికి రాత్రి భోజన ఏర్పాట్లు చేసిన ఆమె స్వయంగా వడ్డించి ఆకలితీర్చారు. మీ ఆదరాభిమానాలను ఎప్పటికీ మరచిపోలేనంటూ కృతజ్ఞతలు తెలిపారు. అక్కడి నుండి ఆదివారం ఉదయం గోవింద నామాలు పలుకుతూ వారంతా తిరుమలకు బయలుదేరి వెళ్ళారు.

## వి.కోటలో బైక్ విన్యాసాలు




వి.కోట,జూన్ 16 ప్రభాతవార్త: వి.కోట మండలంలో మొట్ట మొదటి సారిగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సహకారంతో బైక్ విన్యాసాలు నిర్వహించారు.మండలంలో మోటోక్సైట్ డర్ట్‌క్రాస్ సంస్థతో పాటు పలు సంస్థల సహకారంతో మండలంలో బైక్ రేసింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్ర నాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహకులు జయరాజ్,పృధ్వి భాస్కర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ లేని విధంగా వి.కోట మండలంలో బైక్ రేసింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ రేసింగ్‌లో మొదటి బహుమతి రూ.2లక్షలు,ఒక సైకిల్,రెండవ బహుమతి లక్ష,మూడవ బహుమతి రూ.50వేలు అందజేస్తునట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు,మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రంగనాథ్,టిడిపి నాయకులు రాంబాబు, ధీరజ్, శభరీష్ తదితరులు పల్గొన్నారు.

## చెంచుగుడి మహాభారతంలో అలరించిన దుర్యోధన వధ



వెదురుకుప్పం, జూన్ 16 ప్రభాతవార్త : మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని చెంచుగుడి మహాభారత వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దురోధ్యన వధ కార్యక్రమం పలువురిని అలరించింది. కురుక్షేత్ర సంగ్రామంలో శత సహోదరులను, గురువులను, స్నేహితులను, సైన్యంను పోగొట్టుకుని ఒంటరిగా మిగిలిన దుర్యోధనుడు శమంతక మడుగులో దాగి కురుక్షేత్ర యుద్ధంలో పోగొట్టుకున్నవి తిరిగి సంపాదించడంకు ప్రయత్నం చేయు ఘటనంను శ్రీవెంకటేశ్వర నాట్యకళా మండలి కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి పలువురు ప్రశంసలు అందుకున్నారు. దుర్యోధను పాత్రదారుని, భీమా పాత్రదారి మడుగు నుంచి మహాభారత ఆలయ ప్రాంగణం వద్దకు దప్పుల దరువుల మధ్యతీసుకురావడం జరిగింది. శ్రీకృష్ణుని సాయంతో మడుగులలో దాగిన దుర్యోధనుడి సమాచారం తెలుసుకున్న పాండవులు శమంతక మడుగు వద్దకు చేరుకుని సూటిపోటీ మాటలతో బయటకు తీసుకురావడం ఇతిహాస ఘటనంను పద్యాలు,పాటలు, ఛలోక్తులతో అభినయం చేశారు. భీమ, దుర్యోధన పాత్రదారులు గధ యుద్ధం, ముష్టి యుద్ధం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం హరికథ భాగవతారిణి సుమతిచే ధర్మరాజుల పట్టాభిషేకం కథను గానం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ఉపవాస దీక్షతో ఉన్న భక్తులు కంకణదారులై భక్తిశ్రద్ధతలో స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అగ్ని గుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. దీంతో మహాభారత యజ్ఞ మహోత్సవం పూర్తి చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మాతంగి వేషంతో మిట్టగంగమ్మకు మొక్కులు

**పెద్ద సంఖ్యలో భక్తులు అగ్నిగుంధ ప్రవేశం**



చంద్రగిరి, జూన్ 16 ప్రభాతవార్త: మాతంగి వేషధారణలతో భక్తులు శ్రీ మిట్టగంగమ్మ వారికి మ్రొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. చంద్రగిరిలోని శ్రీ మిట్టగంగమ్మ వారి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జాతర వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 6వ రోజు ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బు స్వామి, అలంకరణ నిర్వహకులు ఉగ్రాణం సుబ్రమణ్యం రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం జరిపించారు. రాత్రి అమ్మవారి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు అగ్నిగుంధ ప్రవేశం చేసి మ్రొక్కులు తీర్చుకున్నారు. చంద్రగిరి మాజీ సర్పంచ్ దుబాసి రామమూర్తి, చంద్రగిరికి చెందిన వట్టికుంట నాగవల్లి రాజశేఖర్ నాయుడు, చంద్రగిరి హలో బ్యూటీ బ్రదర్స్ కామసాని యువరాణి దేవరాజులు రెడ్డి, కొర్లగుంట సుధారాణి ఈశ్వర్ రెడ్డి దంపతులు, గొల్లవాని కాల్వకు చెందిన రహంతుల్లా ఉభయదారులుగా వ్యవహరించారు. చంద్రగిరికి చెందిన నంద్యాల తేజ ప్రసాద్ చందు భక్తులకు అన్నదానం చేశారు. రెడ్డివీధి యూత్ ఆధ్వర్యంలో భజనగుడి నుండి అమ్మవారికి పుట్టింటి సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## "రుయా"ను మరింత మెరుగుచేయండి

**-పేదలకు వైద్యసేవలు చేరువచేయండి-వైద్యఆరోగ్యమంత్రి సత్యకుమార్‌కు బిజెపి నేతల వినతి**



తిరుపతి,జూన్ 16ప్రభాతవార్త: రాయలసీమజిల్లాలకే తలమానికంగా ఉన్న రుయా ఆస్పత్రిని, పలు ప్రభుత్వ ఆస్పత్రులను మరింత మెరుగు పరచాలని, పేదలకు అవసరమైన వైద్యసేవలందించేలా చూడాలని బిజెపి నేతలు వైద్యఆరోగ్యమంత్రి సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా శ్రీవారి దర్శనానికి ఆదివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు తిరుపతి జిల్లా బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, అజయ్‌కుమార్, విశ్వనాద్, భాస్కర్, జయంత్‌కుమార్, శేఖర్, దీపక్‌యాదవ్ పుష్పగుచ్చంతో సాదర స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

**-ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సన్మానించిన సైకం**



తిరుపతిరూరల్, జూన్ 16 ప్రభాతవార్త: నవ్యాంధ్ర రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర సివిల్ సప్లయ్ మాజీ ఛైర్మెన్ సైకం జయచంద్రారెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి పర్యటనకు విచ్చేసిన టిడిపి సీనియర్ నేత, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను ఆదివారం ఓ ప్రవేట్ హోటల్లో సైకం జయచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు సైకం పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలవతో ఘనంగా సన్మానించారు. అనంతరం సైకం జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ విజన్ కలిగిన నాయకుడని, రాష్ట్ర అభివృద్ధి సి.యం. చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలిపారు. గతంలో గాడితప్పిన పాలనను గాడిలో పెట్టే సమర్థత కలిగిన నేత చంద్రబాబునాయుడు అని తెలిపారు. నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఒక చంద్రబాబుకే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని మెచ్చే కనివిని ఎరుగని రీతిలో అఖండ మెజార్టీని కట్టబెట్టారని తెలిపారు.

## శ్రీవారి సేవలో ఎంఎల్‌సి, డిఐజి



తిరుమల,జూన్ 16 ప్రభాతవాం ప్రతినిధి: శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, డిఐజి గోపీనాథజెట్టీ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తుల్లో భక్తుడినై...సౌకర్యాలపై స్వయం ఆరా !

**-అల్పాహారం, పాలు, తాగునీరు లేదని భక్తుల మొర**



తిరుమల,జూన్ 16ప్రభాతవార్తప్రతినిధి: వెంకన్న దర్శనానికి వెలుపల కిలోమీటర్ల దూరం క్యూలైన్లలో వేచివున్న భక్తుల సౌకర్యాలపై ఆరా తీసిన నూతన టిటిడి ఈఓ శ్యామలరావుకు ఉద్యోగుల అరకొర సేవలపై ఫిర్యాదులందాయి. కొన్నిగంటలుగా వెలుపల క్యూలైన్లలో భక్తులకు అల్పాహారం, తాగునీరు. పాలు అందడం లేదని నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు కొన్ని నిమిషాల్లోనే భక్తులు మొరవినిపించడం షాక్‌కు గురయ్యారు. తిరుమలలో టిటిడి ఈఓగా ఆదివారం మధ్యాహ్నం శ్యామలరావు బాధ్యతలు చేపట్టారు. వెంటనే క్యూలైన్లు, కంపార్టుమెంట్లు తనిఖీచేపట్టారు. స్వయంగా ఆయన భక్తులతో మాట్లాడటంతో అసౌకర్యాలపై ఫిర్యాదులందాయి. దీంతో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ఉద్యోగుల సేవలపై అసహనం వ్యక్తం చేశారు. లోటుపాట్లను సరిదిద్దుకుని భక్తుల సేవలో తరించాలని హితవు చేశారు.

# నీ జీతమెంత? మీ ఇంటిని ఇలాగే నిర్వహించుకుంటారా?

**నిధులెంత ఉన్నాయి? వార్డెన్‌ను నిలదీసిన ఎంఎల్‌ఏ-ఐదెకరాల స్థలంలో హాస్టల్! 11 మంది విద్యార్థులా!**



శ్రీకాళహస్తి,జూన్ 16 ప్రభాతవార్త : నీ జీతమెంత? మీ ఇంటిని ఇలాగే మెయిన్‌టెన్ చేస్తారా? ఐదెకరాల స్థలంలో నిర్మించిన హాస్టల్‌లో 11 మంది విద్యార్థులా? నిర్వహణ ఇలాగేనా? అని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్‌పై శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి చిర్రుబుర్రులాడారు. ఆదివారం ఎంఎల్‌ఏ రాష్ట్ర బాలుర సమీకృత వసతి గృహంను ఆకస్మికంగా తనిఖీ చేసారు. శ్రీకాళహస్తిలోని అయ్యల నాడు చెరువులో కోట్లు వెచ్చించి సమీకృత వసతి గృహాన్ని నిర్మించారు. తెలుగుదేశం హయాంలో ఈ హాస్టల్‌లో సీటు కోసం నియోజకవర్గంలోని విద్యార్థుల తల్లిదండ్రులే కాకుండా పొరుగు జిల్లాల వారు కూడా పోటీ పడే వారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కారణం హాస్టల్ నుంచి పాఠశాలలు కళాశాలలకు వెళ్ళె విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవటంతో ఇక్కడ చేరటానికి విద్యార్థులు ముందుకు రావటం లేదు. బ్రహ్మాండమైన గదులుండగా విద్యార్థులు లేకపోవటం పట్ల శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.

### ఎంత మంది విద్యార్థులున్నారు?

పట్టణ నడిబొడ్డులో ఉన్న వసతి గృహాన్ని గతంలో కూడా పర్యవేక్షించే వారు. కానీ ఐదేళ్ళలో వార్డెన్ పలుమార్లు నాయకులకు సమస్యలు వివరించినా అరచేతిలో స్వర్గం చూపారు తప్ప పరిష్కరించలేదు. వార్డెన్‌ను ఎంఎల్‌ఏ ఎంత మంది విద్యార్థులున్నారని ప్రశ్నించగా డిగ్రీ విద్యార్థులు 11 మంది.6నుంచి 10వ తరగతి వరకు 10 మంది ఉన్నారని వివరించారు.దాంతో ఎంఎల్‌ఏ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.హాస్టల్‌లో గదులు కావాల్సి నని ఉండగా విద్యార్థులు లేకపోవటంపట్ల అసహనం వ్యక్తం చేసారు. ఇక్కడ సిబ్బందికి లక్షల్లో ప్రభుత్వం జీతాలు చెల్లిస్తూంటే విద్యార్థులు ఎందుకు చేరటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు.ఇక హాస్టల్ ఆవరణ అస్తవ్యస్తంగా ఉండటం ప్రహరి గోడ లేకపోవటం ఆవరణలో పందులు సంచరిస్తుండటంను గమనించిన శాసనసభ్యుడు తీవ్ర అసహనానికి గురయ్యారు.సిఆర్‌ఎస్ నిధులు ఉపయోగించి పాఠశాలలు హాస్టళ్ళను అభివృద్ధి చేస్తామన్నారు.ఇక్కడి దారుణ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చిబాగు చేస్తామన్నారు.ఇక్కడి సమస్యలను తెలుసుకున్న ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి విద్యార్థులు చేరటానికి అవసరమైన వాతావరణం కల్పిస్తామన్నారు.ఆయనతో పాటు పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు, మాజీ పాలసరఫరా సంఘం అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, కంఠారమేష్,కాసరం రమేష్, కన్నలి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.